క్లుప్తంగా

మూగ జీవాలకు మంచి సేవలు అందించండి

బలిజిపేట: మూగజీవాలకు మంచి సేవలు అందించాలని జెడ్పీటీసీ రవికుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని చిలకలపల్లి, నారాయణపురం, అజ్జాడ గ్రామాల్లో మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం నిర్వహించారు. చిలకలపల్లిలో జెడ్పీటీసీ రవికుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు ఏఏ రోగాలకు సంబంధించిన చికిత్సలు చేపడుతున్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మూడు గ్రామాల్లో 86పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, చూడి పరీక్షలు, 78పశువులకు వైద్యం, మందుల పంపిణీ, 235 పశువులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశామని పశు వైద్యాధికారి గణేష్ తెలిపారు. ఇంకా ఏవైనా పశువులు మిగిలిపోతే సిబ్బంది వాటికి తగు పరీక్షలు చేపడతారని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరరావు



మున్సిపల్ వైస్‌చైర్మన్ గున్నేశ్వరరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


పార్వతీపురం: ఆర్యవైశ్యులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని పార్వతీపురం మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందువూరు గున్నేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక శ్రీవాసవి ఆర్యవైశ్య ఇందువూరు వెంకట్రావు కల్యాణ మంటపంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఐ.గున్నేశ్వరరావును సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల ఆర్యవైశ్య యువత రాజకీయాల్లోకి వచ్చి సేవా కార్యక్రమాల్లో ఎలా రాణించారో? రాజకీయాల్లో కూడా అలాగే రాణించాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతుల పంటలకు మద్దతు ధర చట్టబద్ధం చేయాలి

పార్వతీపురంటౌన్: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టబద్ధం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఎన్నికల ముందు డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పి ఇచ్చిన హామీకి 18 ఏళ్లు కావస్తున్నా నేటికీ అతీ గతి లేదన్నారు. ఈ కాలంలోనే కొద్ది మందిగా ఉన్న బహుళ జాతి సంస్థలకు రూ.14 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చిన ఈ పెద్దమనిషి రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలకు చట్టబద్ధం చేస్తే వినియోగదారులపై భారం పడుతుందని చెప్పడం రైతులను దేశ ప్రజలను వంచించడమే అవుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో వెలమల సత్యనారాయణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, జల సహాయ కార్యదర్శి ఈవీ నాయుడు, ట్రెజరర్ బొత్స గౌరునాయుడు పాల్గొన్నారు.

పీపీపీ.. డుండుండుం..!

- మోగనున్న పెళ్లి బాజాలు
- ఏడాదిలో మూడు నెలలు మినహా అన్ని నెలల్లో మూహూర్తాలు
- కల్యాణ మంటపాలు, ఫంక్షన్ హాల్స్‌కు డిమాండ్



బలిజిపేట: 2025వ సంవత్సరం పెళ్లిళ్ల సందడికి మంచి తరుణంగా భావిస్తున్నారు. ఈ ఏడాది 12నెలల్లో మూడు నెలలు మినహా మిగిలిన తొమ్మిది నెలలు 104ముహూర్తాలు ఉన్నాయని అర్చకులు చెబుతున్నారు. గడిచిన మూడేళ్లలో పెద్ద సంఖ్యలో లేని ముహూర్తాలు ఈ ఏడాదిలో మాత్రమే ఉన్నాయంటున్నారు. సాధారణంగా ఈనెల 22నుంచే పెళ్లి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. కానీ కొందరు ఈనెల 30నుంచి ముహూర్తాలు ప్రారంభమవుతున్నాయని చెబుతున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు మినహా మిగిలిన నెలల్లో ముహూర్తాలు ఉండడం విశేషం.

ముందే బుకింగ్‌లు

ఈ ఏడాది పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో అన్ని ప్రాంతాల్లో కల్యాణ మంటపాలు, ఫంక్షన్ హాల్స్‌కు మంచి డిమాండ్ పెరిగింది. సాధారణ ఫంక్షన్ హాల్స్ దగ్గర నుంచి పెద్దపెద్ద ఫంక్షన్ హాల్స్ వరకు అన్నింటికీ ముందస్తుగానే బుకింగ్‌లు చేసుకుంటున్నారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్స్ సదుపాయం లేకపోవడంతో ఆర్భాటంగా చేయాలనుకునేవారు సమీప పట్టణంలో కల్యాణమంటపాలు, ఫంక్షన్ హాల్స్‌ను ముందుగానే బుక్‌చేసుకుంటున్నారు.



బలిజిపేటలోని కళింగ వైశ్య కల్యాణ మంటపం

ముహూర్తాలతో ఉపాధి

ఈ ఏడాది పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో అందరికీ మంచి ఉపాధి లభించే అవకాశముంది. దుస్తులు, బంగారం, కిరాణా వ్యాపారాలు జోరందుకోనున్నాయి. లైటింగ్ డెకరేషన్, షామియానాలు, టైలరింగ్, వాయిద్య కళాకారులు, బ్రాహ్మణులు, రజకులు, నాయీబ్రాహ్మణులు, వంటమేస్త్రీలు, పువ్వుల వ్యాపారులు, పెయింటర్లు, ఫొటోగ్రాఫర్లు, ట్రావెల్స్, రోజువారీ కూలీలు తదితర అన్ని రంగాలకు చెందిన వారికీ ఉపాధి లభించే అవకాశాలున్నాయి.

ఈ ఏడాది ముహూర్తాలు ఇలా..

జనవరి: 22, 23, 24, 25, 29, 30, 31
ఫిబ్రవరి: 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14, 15
మార్చి: 4, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21, 22, 25, 26
ఏప్రిల్: 2, 3, 4, 5, 7, 8, 10, 11, 12, 14, 15, 21, 22, 23, 29
మే : 1, 2, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 14, 20, 27, 28, 29, 30
జూన్: 3, 4, 5, 6, 7, 10, 11, 12
జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ముహూర్తాలు లేవు
అక్టోబర్: 14, 16, 17, 18, 20, 21, 22, 23, 25, 30, 31
నవంబర్: 7, 13, 14, 18, 19, 20, 21, 22, 26, 27
డిసెంబర్: 2, 4, 5, 6, 15, 16, 17, 18, 19, 20, 23, 24, 30

ముహుర్తాలు ఎక్కువ



ఈ 2025వ సంవత్సరంలో పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల అందరికీ శుభప్రదంగా ఉంటుంది. ముఖ్యంగా వీటిపై ఆధారపడి ఉండేవారికి జీవనోపాధి దొరుకుతుంది. పెళ్లి జరిగిందంటే ఎంతోమందికి పని ఉంటుంది.

– గోపాలకృష్ణ, పురోహితుడు, వెంగాపురం, బలిజిపేట మండలం

మాజీ ఎమ్మెల్సీ కుటుంబానికి జెడ్పీ చైర్మన్ పరామర్శ



ద్వారపురెడ్డి సావిత్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో గల కర్షక మహర్షి ఆస్పత్రి అధినేత డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, టీడీపీ మాజీ శాసనమండలి సభ్యుడు ద్వారపురెడ్డి జగదీష్ మాతృమూర్తి ద్వారపురెడ్డి సావిత్రమ్మ ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ మేరకు స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ద్వారా విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ జగదీష్ నివాసానికి వెళ్లి ద్వారపురెడ్డి సావిత్రమ్మ చిత్ర పటానికి సోమవారం నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, మాజీ వైస్‌చైర్మన్ బెలగాం జయబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైస్ ఎంపీపీలు సిద్ధ జగన్నాథం బంకురు రవిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిదులు కౌన్సిలర్‌లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

సీతానగరం: మండలంలో పశువైద్యాధికార సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య వైద్య శిబిరాలను రైతు సోదరులు వినియోగించుకోవాలని ఎంపీపీ బి.రమణమ్మ అన్నారు. మండలంలోని పెదంకలాం, సుమిత్రాపురం గ్రామాల్లో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో పశువైద్యశిబిరాలను సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ బి.రమణమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో రైతు సోదరులు ఆర్థికాభివృద్ధి చెందడానికి పాడి పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటా పాడి పశువులు కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. వైద్యాధికారి రామారావు మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరంలో 235 పశువులకు వైద్యసేవలు అందించినట్లు తెలియజేశారు. రాత్రివేళ కోళ్లకు వ్యాధి నిరోధక మందులు వేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, గ్రామపెద్దలు, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పశుసంపదకు జాగ్రత్తలు అవసరం

పార్వతీపురం టౌన్: సీజన్ ప్రకారం మూగజీవాలైన పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే పశుసంపదను మరింత పెంపొందించగలమని మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరి అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని బూరాడ వీధిలో గల పశువులకు పశువైద్యాధికారి భోగి చక్రధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు మండలంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను రైతులకు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బళ్లకృష్ణాపురంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీకి అండగా ఉంటున్న కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఇటీవల స్వర్గస్థులైన కొల్లు రాములు,అక్కేన సత్యనారాయణ, నడిమింటి నీలిమ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, స్థానిక సర్పంచ్ బళ్ల జగన్నాథం, సీడీసీ మాజీ చైర్మన్ రామకృష్ణ, గెద్దలుప్పి సర్పంచ్, ఎంపీటీసీలు అల్లుతిరుపతిరావు, కె.సత్యనారాయణ, బక్క సూర్యనారాయణ వెంకటాపురం ఎంపీటీసీ శంకరరావు, నియోజకవర్గ పార్టీ నాయకులు ఆర్వీ పార్థసారథి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌ను ఆదుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌గా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం రుణాలు, ఇళ్ల స్థలాలు అందించి ఆదుకోవాలని పార్వతీపురం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకిముక్కల రామచంద్రరావు కోరారు. జాతీయ ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా పార్వతీపురం జిల్లా కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో ప్రధాన పాత్ర వహిస్తూ వినియోగదారులకు ఎనలేని సేవలు అందిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ పనివారికి కనీస ఆదాయం లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం చేయూత అందించి ఆదుకోవాలని కోరారు. అనంతరం పార్వతీపురం మార్కెట్ యార్డ్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రైవేట్ ఎలక్ట్రికల్ పనివారితో పాటు ఆ సంఘం నాయకులు మజ్జి శంకర్రావు, ఎస్.కనకరాజు, నల్లి సంగమేశ్వర రావు, రత్నాకరరావు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలి



జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు వినతి పత్రం అందజేస్తున్న పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు

పార్వతీపురంటౌన్: సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేసే విధంగా చర్యలు చేపట్టాలని పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల్లో ఉచిత ఆధార్ కేంద్రాలు సుమారు 11 నెలలుగా పనిచేయడం లేదని, దీని కారణంగా పురప్రజలు, విద్యార్థులు, తమ ఆధార్ కార్డులలో దొర్లిన తప్పులను సరిచేసుకోవడానికి, ఫోన్‌నంబర్ లింకింగ్, నవజాత శిశువులు కొత్తగా ఆధార్ కార్డు నమోదు సేవల నిమిత్తం చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఆధార్ కేంద్రాలు పనిచేసే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లివెంకటరమణ పాల్గొన్నారు.

రిజర్వ్‌డ్ కేటగిరి మద్యం షాపులకు నోటిఫికేషన్

పార్వతీపురంటౌన్: జిల్లా పరిధిలో రిజర్వ్‌డ్ కేటగిరి మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ ఈఎస్ శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో ఒక ఎ-4 షాపు, సాలూరు రూరల్ పరిధిలో ఒక ఎ-4 షాపు, వీరఘట్టం పరిధిలో ఒక ఎ-4 షాపు గెజిట్ నంబర్-2/25 ప్రకారం అందజేస్తున్నట్లు తెలిపారు. వాటి అప్లికేషన్ ఫీజు రూ.2లక్షలు, లైసెన్స్ ఫీజు రూ. 21.66 లక్షలు ఉంటుందన్నారు. 2025-26వ సంవత్సరానికి లైసెన్సు ఫీజు రూ. 35.75 లక్షలు ఉంటుందని తెలిపారు. లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామన్నారు. వచ్చే నెల 5 తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వచ్చె నెల 7వ తేదీన 10 గంటలకు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్ వద్ద కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహిస్తామన్నారు. అప్లికేషన్‌లు జిల్లాలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ల వద్ద గానీ, ఆన్‌లైన్‌లో గానీ, హైబ్రిడ్ విధానంలో గాని దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్లు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు ఆర్.రాము అన్నారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో 108 ఫీడర్ అంబులెన్స్ సేవల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు 2018 నుంచి సేవలందిస్తున్నారని, వారికి కేవలం రూ.12 వేలు జీతం చెల్లిస్తున్నారన్నారు. గత 7 సంవత్సరాలలో ఎటువంటి వేతన పెంపు వారికి యాజమాన్యం అమలుచేయ లేదన్నారు. చాలీచాలని వేతనాలతో గిరిజన ప్రాంతాలలో సేవలను అందిస్తున్నారని చెప్పారు. 108 ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచి నెలకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ అమౌంట్ సక్రమంగా జమ చేయాలని, ఉద్యోగుల మధ్య హెచ్చు తగ్గులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎం.రమేష్, జోగారావు, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు గుంతల కప్పివేత



సన్యాసిరాజుపేట సమీపంలో మట్టిలో కప్పిన గుంతలు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: సాలూరు నుంచి బాగువలస మీదుగా మక్కువ రోడ్డు పూర్తిగా గుంతలతో నరకప్రాయంగా మారింది. గుంతల్లో కర్రలు ఏర్పాటుచేసి ప్రయాణికులకు ప్రమాద సూచికలను ప్రజలు ఏర్పాటు చేయడాన్ని తెలుపుతూ ప్రాణాలు పోతే గాని పట్టించుకో రా? అనే శీర్షికన సాక్షిలో ఈ నెల 7న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు గుంతలను పలుచోట్ల కప్పారు. శంబర పండగ నేపథ్యంలో ప్రజలు శంబర ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. గుంతలతో నరకప్రాయంగానే ఈ రోడ్డు ఉందని, ఇంకెన్నాళ్లు ఈ నరకయాతన అంటూ ప్రజలు నిట్టూరుస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పించనున్నట్లు ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు సోమవారం బక్కుపేటలో జరుగుతున్న ఫారంపాండ్స్ పనులు చేస్తున్న వేతదారుల మస్తరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఉపాది పనులు కల్పించడంతో పాటు మళ్లగట్లు, ఫారం పాండ్స్ నిర్మాణం పనులకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. అలాగే వేతనదారులకు పనులు కల్పించడానికి అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, వాటి ప్రాధాన్యతా క్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

మార్కెట్‌లో మన్యం పసుపు డీలా..!

- 1512 హెక్టార్లలో సాగు
- ఎకరాకు 25–30 కావిళ్ల వరకు దిగుబడి
- పచ్చి పసుపు కావిడ రూ.600, 700 ధర
- కొనుగోలు కేంద్రాలు నిల్



వారపుసంతలో కావిళ్లతో పచ్చిన పసుపు కొమ్ములు



కొండపోడులో పండిస్తున్న పంట

సీతంపేట:

మన్యం పసుపు మార్కెట్‌లోకి వచ్చింది. సరైన ధరలు లేకపోవడంతో గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. జిల్లాలో దాదాపు 1512 హెక్టార్లలో పసుపు గిరిజనులు సాగు చేస్తున్నారు. ఇక్కడి పసుపు పంటకు నాణ్యమైనదిగా గుర్తింపు ఉండడంతో మైదాన వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. ఏజెన్సీ సంతలకు వచ్చిన పసుపు కొమ్ములను కొనుగోలు చేస్తున్నారు. జీడిపంటలో అంతరపంటగా పసుపు సాగు చేస్తారు. కుశిమి, శంభాం, జొనగ, దోనుబాయి, మర్రిపాడు, పొల్ల, కడగండి తదితర పంచాయతీల పరిధిలో ఈ పంట సాగవుతుంది. ఉద్యానవనశాఖ కూడా గతంలో ఈ పంటను ప్రోత్సహించేది. పసుపు విత్తనాలు కూడా ఇచ్చేవారు. అయితే కొన్నేళ్లుగా రైతులకు పసుపు విత్తనాలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. రైతులే విత్తనాలు తయారు చేసుకుని సాగుచేస్తున్నారు. అంతగా పెట్టుబడులు లేకపోవడంతో గిరిజన రైతులు ఈ పంటను ఎక్కువగా పండిస్తున్నారు. మైదానప్రాంతాలతో పోలిస్తే ఏజెన్సీలోనే అధిక విస్తీర్ణంలో పసుపు సాగవుతుంది,

ఒక్కో కావిడ రూ.600 నుంచి 700

ఎకరా పొలంలో 10 కావిళ్ల వరకు పసుపు విత్తనాలు నాటుతారు. బాగా పండితే 25 నుంచి 30 కావిళ్ల వరకు దిగుబడి వస్తుందని గిరిజనులు తెలిపారు. అంతరపంటగా గిరిజనులు దీన్ని పండిస్తున్నారు. ఏడాదిలో రెండుసార్లు పసుపుదుంపలను తవ్వుకోవచ్చని గిరిజనులు తెలిపారు. ఒక్కో కావిడి రూ.600 నుంచి 700ల వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తామని చెప్పారు. మైదానప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కొద్ది రోజులు పోతే ఎండు పసుపు కావిడ రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తామన్నారు. ఎండు పసుపుకొమ్ములు తయారు కావాలంటే చాలా పనిపడుతుంది. పచ్చి పసుపును ఉడకబెట్టి బాగా ఎండబెట్టి కాళ్లతో తొక్కినట్లయితే పైపొర పోతుందని దీన్ని వారపు సంతల్లో విక్రయిస్తామని గిరిజనులు తెలిపారు. గిరిజన సహకార సంస్థ వంటివి ఉన్నా పసుపు కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. వీడీవీకేలు నిర్వహిస్తున్నప్పటికీ నామమాత్రంగానే ఉన్నాయని గిరిజనులు తెలియజేస్తున్నారు. ఇక్కడ పసుపు గుండ తయారు చేస్తున్నప్పటికీ దానికి కూడా సరైన మార్కెట్ సదుపాయం లేదని వాపోతున్నారు.



బుట్టలతో పసుపుకొమ్ములు తీసుకువస్తున్న మహిళలు

గిట్టుబాటు ధర కల్పించాలి



పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. జీసీసీ పసుపు కొనుగోలు చేయడం లేదు. దీంతో దళారుల బారిన పడాల్సి వస్తోంది. గిట్టుబాటు ధరలు కల్పించాలని గతంలో అనేక వినతులు కూడా సమర్పించాం.

– ఎస్.సాయికుమార్, మాజీ సర్పంచ్, మండ

కొండపోడులో పండిస్తాం



కొండపోడులో పసుపు పండిస్తాం. అన్ని పంటలకంటే జనవరి నుంచి ఈ పంట చేతికందుతుంది. పసుపు ఉడకబెట్టి ఆరబెట్టి గ్రేడింగ్ చేయడం ద్వారా మంచి పసుపుగా తీర్చిదిద్దుతాం. అనంతరం మార్కెట్లో విక్రయిస్తాం.

– త్రినాథరావు, అచ్చిబ